# శివయ్య సన్నిధిలో పనిచేయడం తన అదృష్టం

## -నూతన ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి



తొట్టంబేడు, అక్టోబర్ 26 ప్రభాతవార్త
శివయ్య సన్నిధిలో పనిచేయడానికి అవకాశం రావడం తన అదృష్టమని నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఆయన తొలుత శ్రీకాళహస్తీశ్వర స్వామిఅమ్మవార్లను దర్శించుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌కడపజిల్లాలో డిఎస్ఓగా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశానని ఈనేపధ్యంలో సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాళహస్తి ఆర్డీవోగా ప్రభుత్వం నియమించిందన్నారు. ఆర్డీవో కార్యాలయ పరిధిలోని మండలాల్లో భూసమస్యలను పరిష్కరించేందుకు అనుకూలంగా డివిజన్ల ఏర్పాటును ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషం అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని ప్రభుత్వ పథకాలు అమలుకు చర్యలుతీసుకుంటామన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# రేపు సాయంత్రం ఆలయాలు మూసివేత



తిరుమల,అక్టోబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:
చంద్రగ్రహణం కారణంగా శనివారం రాత్రి 7.05గంటలకు వెంకన్న ఆలయ తలుపులు మూసివేయనున్న టిటిడి అధికారులు. దాదాపు ఎనిమిదిగంటల పాటు దర్శనాలు కూడా రద్దుచేశారు. ఆదివారం తెల్లవారుజామున 3.15గంటలకు ఆలయ తలుపులు తెరుస్తారు. అలాగే రుపతి పరిసరాల్లో ఉన్న టిటిడి అనుబంధ ఆలయాలు కూడా చంద్రగ్రహణం కారణంగా రేపు మూతబడుతున్నాయి.

# మన భవిష్యత్తు ఏంటో ...మీరూ ఆలోచన చేయాలి !

## పోరాటం మన బలం...గెలుపు తథ్యం - ఎన్నికలకు ముందు భయపెట్టాలని జగన్ చూస్తున్నాడు

## నిజం గెలవాలి సభలో నారాభువనేశ్వరి





తిరుపతి,అక్టోబర్ 26ప్రభాతవార్త:
రాష్ట్రంలో నాలుగున్నరేళ్ళ వైసిపి ప్రభుత్వంలో హింస, అరెస్టులు, భయపెట్టడం వంటివి పెట్రేగిపోయాయని, పరిస్థితి ఇలానే ఉంటే మన భవిష్యత్తు ఏంటో అందరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని నారా భువనేశ్వరి విచార వదనంతో అన్నారు. స్వేచ్ఛకోసం మనం పోరాటం చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. ప్రజల కోసం నిరంతరం ఆలోచన చేసి ,శ్రమించే చంద్రబాబును 48రోజులుగా అక్రమంగా జైల్లోపెట్టారని, ఆయన క్రమశిక్షణ గలనాయకుడని,అదే స్ఫూర్తితోనే పోరాడుదామని ఆమె పిలుపునిచ్చారు. పోరాటం మన బలమని, గెలుపు తథ్యమని అన్నారు. ఎన్నికలకు ముందు తెలుగుదేశంపార్టీ కుటుంబసభ్యుల్ని భయపెట్టాలని జగన్ చూస్తున్నాడని, అందుకే బాబును అక్రమంగా ఆధారాలు లేకుండా జైల్లో పెట్టారని మండిపడ్డారు. తమ కుటుంబం నలుగురుం నాలుగుదిక్కులయ్యామని, మనవడు దేవాన్ష్‌కు తాత విదేశాలకు వెళ్ళాడని చెబుతున్నామని ఆవేదనతో వెల్లడించారు. నేను గ్యారంటీ ఇస్తున్నానని...చంద్రబాబు నిర్ధోషి అని ,జగన్ ప్రభుత్వం, సిఐడి వాళ్ళు ఏం విచారణ చేస్తారో చేయని ,కేవలం భయపెట్టాలనే ఇదంతా చేస్తున్నారని అన్నారు. పవన్‌కల్యాణ్‌తో మాట్లాడినపుడు ఆయన మాలాగే ఆలోచన చేస్తున్నారని, రెండు పార్టీలు (టిడిపి, జనసేన)ఇలాగే కలిసి ముందుకువెళ్ళాలన్నారు. 2014 విభజన ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు అహర్నిశలు శ్రమించారని, రాయలసీమకు మరింత అభివృద్ధి చేయాలనే ధ్యాసతోనే తిరుపతిలో ఎలక్ట్రానిక్, హార్డ్‌వేర్ హబ్ క్రింద చాలా హార్డ్‌వేర్ తెచ్చారని గుర్తుచేశారు. నాలుగన్నరేళ్ళలో అవి ఏమయ్యాయని, జగన్ అమర్‌రాజా సంస్థను ఇబ్బందిపెట్టారని ,9,300కోట్లు ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడి పెట్టి అక్కడ ఉద్యోగాలు కల్పించారని ఆమె తెలిపారు,.

## సచివాలయ పరిధిలో లబ్ధిపొందిన వారి వివరాలతో

# సమాచార ప్రచార బోర్డుల ఆవిష్కరణ

## నవంబర్ 1 నుండి మార్గ దర్శకాల మేరకు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 26, ప్రభాతవార్త
ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల కింద సంబంధిత సచివాలయం పరిధిలో డిబిటి, డిబిటి ఏతర పద్ధతి ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలతో, సంక్షేమ పతకాల వారీగా కూడిన సమాచార ప్రచార బోర్డులు సచివాలయాల వద్ద అథితులచే ఆవిష్కరింప చేసి పెద్ద ఎత్తున ప్రజలను, లబ్ధిదారులను కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం చేపట్టిన పథకాలను, వాటి ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని తెలియజేయాలని కలెక్టర్ వెంకటరమణా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలోని ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్‌లు, గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది తదితర అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ పరిధిలో డిబిటి, డిబిటి ఏతర పద్ధతి ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలతో, సంక్షేమ పథకాల వారీగా కూడిన సమాచార ప్రచార బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమాలను నవంబర్ 1వ తేది నుంచి మార్గ దర్శకాల మేరకు అధికారులు నిర్వహించాలనీ ఎలాంటి చిన్న పొరపాటుకు అలసత్వానికి తావు ఇవ్వరాదని సూచించారు. ప్రభుత్వం డిబిటి, డిబిటి ఏతర, ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు వెరసి మొత్తం 34 సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలు సంక్షేమ పతకాల వారీగా నవంబర్ 1 నుండి ఒక నెలపాటు వివిధ గ్రామ వార్డు సచివాలయాల వద్ద షెడ్యూల్ మేరకు కార్యాలయాల పనిదినాలలో మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు నిర్వహించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈఓపిఆర్డిలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు కార్యక్రమాల నిర్వహించేలా వుండాలని సూచించారు. సంబంధిత ఎంపిడిఓలు మున్సిపల్ కమిషనర్లు కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లు సక్రమంగా జరుగుతున్నాయా అని పర్యవేక్షించాలని, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణ రోజు ఏర్పాట్లు అన్ని సక్రమంగా మార్గదర్శకాల మేరకు ఉండేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు నిర్దేశిత సమయం కన్నా ముందే కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ వార్డు సచివాలయం ఇంచార్జి అధికారిణి సుశీలా దేవి, డిఎల్డీఓలు ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచిత వైద్యం

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 26, ప్రభాతవార్త
ప్రతి ఒక్కరికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచిత వైద్యం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్నట్లు నగర మేయర్ డా. శిరీష పేర్కొన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు గాంధీ ట్రస్ట్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రకాశం రోడ్డు, ఇందిరా నగర్, ఎల్ఐసి రోడ్డు సంబంధించిన ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో పాల్గొని అన్నీ పరీక్షలు చేయించారన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో ఈ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి వాలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది వచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతంగా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పమని తెలిపారు. ఆరోగ్య సురక్ష శిభిరంలో సుమారు 1000 మంది సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. వీరందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష కింద ఉచితంగా మందులు పంపిణీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డిఎంహెచ్ఓ శ్రీహరి, కార్పొరేటర్లు రేవతి, ఆదిలక్ష్మి, నగర పాలక ఆరోగ్యాధికారి డాక్టర్ అన్వేష్ రెడ్డి, సూపరింటెండెంట్ రవి, మధుబాబు, డాక్టర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## నగర మేయర్ శిరీష



## వైభవంగా

# శ్రీ విరూపాక్షమ్మ పుష్పయాగం



రామచంద్రాపురం, అక్టోబర్ 26 ప్రభాతవార్త:
సి.రామాపురం సమీపంలో వెలసియున్న శ్రీ విరూపాక్షమ్మ అమ్మవారికి గురువారం అంగరంగ వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుండి సేకరించిన సుగంధభరిత పుష్పాలను మేళతాళాలు మంగళవాయిధ్యాల నడుమ గ్రామవీధులలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి అయ్యంగార్ అమ్మవారిని వివిధ సుగంధద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ పుష్పయాగం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ పుష్పయాగానికి కొట్టే వేణునాధం రెడ్డి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పూజారి అమర్‌నాద్ రెడ్డి, కొల్లంగుంట మునికృష్ణారెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఆర్డీఓగా నిషాంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

తిరుపతిరూరల్, అక్టోబర్ 26 ప్రభాతవార్త:
తిరుపతి డివిజన్ రెవెన్యూ అధికారిగా నిషాంత్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్డీఓ జిల్లా కలెక్టర్ వెంకటరామిరెడ్డిని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నిషాంత్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.





నా మట్టి.. నా దేశం
కలశాల
గ్రామోత్సవం

4లో

# దక్షిణ కొరియాలో జరిగిన డిజిటల్ లీడర్‌షిప్ కార్యక్రమంలో

# శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బృందం



తిరుపతి (మహిళావర్సిటీ), అక్టోబర్ 26, ప్రభాతవార్త
ఈ నెల 24వ తేది నుంచి 26వ తేది వరకు దక్షిణ కొరియాలోని ఇంచియాన్‌లో జరిగిన యుఎన్ - ఏపిసిఐసిటి డిజిటల్ లీడర్‌షిప్ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బృందం పాల్గొంది. ప్రొఫెసర్ రజనీ, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ పి. ఉమామహేశ్వరి దేవి, వైస్ చైర్ పర్సన్, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్ జర్నలిజం కొత్త వైఫై 2.0 ట్రైనింగ్ మాడ్యూల్ పై చర్చల్లో పాల్గొన్నారు. యుఎన్‌ఏపిసిఐసిటి ఆసియా పసిఫిక్‌లో ఐసిటి ఎనేబుల్డ్ మహిళా వ్యవస్థాపకతను ప్రోత్సాహించడానికి 2016లో వైఫై కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎస్‌పిఎంవివి ఈ కార్యక్రమాన్ని 2018లో అమలు చేసింది. ఏపిసిఐసిటి ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీలో అనూహ్య మార్పులను దృష్టిలో ఉంచుకుని కొత్త శిక్షణా మాడ్యూళ్లను అభివృద్ధి చేసింది. కొత్త మాడ్యూల్స్ ఎంఎస్‌ఎంఈలోని మహిళలకు డిజిటల్ పరివర్తన, ఆవిష్కరణలకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందిస్తాయి. 19 ప్రతినిధులు చర్చలలో పాల్గొన్నారు. కొత్త వైఫై మాడ్యూల్స్ యొక్క విషయాలపై అభిప్రాయాన్ని అందించారు. ఎస్‌పిఎంవివి భారతదేశంలో వైఫై అమలు కోసం ఒక కార్యాచరణ ప్రణాళికను కూడా అందించింది. భాగస్వామ్య దేశాలలో అమలు చేయడానికి వైఫై 2.0 ఏప్రిల్‌లో ప్రారంభించబడుతుందని యుఎన్ ఏపిసిఐసిటి, ఈఎస్‌సిఏపి డైరెక్టర్ మిస్టర్ కియోంగ్ కో ప్రకటించారు.

# పోలీసుల వెపన్స్ వినియోగంపై విద్యార్ధులకు వివరించిన అదనపు కమాండర్



వెంకటగిరి, అక్టోబర్ 26, ప్రభాతవార్త
పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక తొమ్మిదో బేటాలియంలో విద్యార్ధులకు తుపాకుల వినియోగంపై అదనపు కమాండెంట్ అరుణ్ బోస్, సిబ్బంది వివరించారు. ఎలా వినియోగిస్తారు పోలీసుల విధులు వాటి గురించి విద్యార్ధులకు తెలియజేసారు. వెంకటగిరి పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్ధులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని బెటాలియన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద కన్నా, ఆర్ఐ నందీశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# మీ మెప్పు కోసం మాకేంటి శిక్ష !

## అంగన్‌వాడీలకు అందని ఖర్చులు

కోట,అక్టోబర్ 26 ప్రభాతవార్త
ప్రజారోగ్యం బాగు కోసం శిబిరాలు నిర్వహిస్తున్నాం.. ఇందుకోసం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో సచివాలయాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా కార్పొరేట్ తరహాలో మెరగైన వైద్యం సేవలందిస్తున్నాం. రోగులను పరీక్షించి అవసరమైన మందులు కూడా పంపిణీ చేయిస్తాం..ఇవీ ప్రభుత్వం చెబుతున్న గొప్పలు, మాటలు ఏలా ఉన్నప్పటికీ ఈ కార్యక్రమం కొందరికి అప్పులు తప్పడం లేదు. శిబిరాల వద్దకు వచ్చే వారికి అవగాహన కోసం ఏర్పాటు చేస్తున్న పౌష్టికాహారం పదార్ధాల ప్రదర్శన ఇందుకు కారణం. వీటిని తయారు చేసేందుకు అంగన్‌వాడీలకు ఎటువంటి నగదు ఇవ్వడం లేదు. కనీసం రాకపోకలు సాగించేందుకు రవాణా చార్జీలు కూడా అందజేయడం లేదు. దీంతో అధికారులు,నాయకుల మెప్పు కోసం అప్పులు చేసి పిండి వంటలు సిద్ధం చేసి ప్రదర్శనలకు ఉంచాల్సిన పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు గొప్పలు చెప్పుకోవడానికి వేదికలవుతున్నాయి.అదే సమయంలో తమకు తలకు మించిన భారంగా మారాయిని శిబిరాల్లో బాధ్యతలు తలకెత్తుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు,సహాయకులు, ఆశా కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో శిభిరంలో హెల్ప డెస్క్ రిజిస్ట్రేషన్,మందులు పంపిణీ, పరీక్షల నిర్వహణ ,ఆరోగ్యమిత్ర న్యూట్రీషన్ స్టాల్ కంటి వెలుగు, నిపుణులు,నలుగురు వైద్యులు గదులు ..ఇలా పలు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో రోగులకు సహకారం అందించడం తదితర బాధ్యతల్లో ఆశాల సేవలు వినియోగిస్తున్నారు.పోషకాహార ప్రదర్శన బాధ్యతల్ని అంగన్‌వాడీ సిబ్బంది చూస్తున్నారు. అంన్‌వాడీలది మరో రకమైన బాధ.వైద్య శిబిరంలో పోషకాహార ప్రదర్శనలో మోయలేని భారం పడోతుందని వారు వాపోతున్నారు. ప్రదర్శనకు అవసరమైన పోషక పదార్ధాల తమ వద్ద లేనివి కొనుగోలు చేయడం, వండి ప్రదర్శనలో ఉంచడానికి తలా కొంత వేసుకోవాలని పై ధికారులు నుంచి ఒత్తిడి వస్తోందని కొందరు పేర్కొంటున్నారు. ఇలా చూసుకొంటే ఒక్కో స్టాల్ నిర్వహాణకు కనీసం 5 వేల నుంచి 10 వేల వరకు ఖర్చు తప్పడం లేదని ఆమెత్తాన్ని సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు భరించాల్సి వస్తోందని వాపోతున్నారు.



అంగన్‌వాడీ వర్కర్లు తయారీ చేసిన పిండి వంటలు

## నేడు కుప్పం తెదేపా విస్తృతస్థాయి సమావేశం

కుప్పంరూరల్, అక్టోబర్ 26 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం కమతమూరు దండుమారెమ్మ ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహిస్తున్నట్లు పార్టీ ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశం అత్యంత కీలకమైందని సమావేశానికి పార్టీ శ్రేణులు, వివిధ పార్టీ హోదాలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలన్నారు. సమావేశం హాజరును రాష్ట్రపార్టీ కార్యాలయంకు పంపించడం జరుగుతుందన్నారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## శరవేగంగా నూతన మున్సిపల్ కార్యాలయం పనులు

కుప్పంరూరల్, అక్టోబర్ 26 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ కార్యాలయం నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుప్పం మున్సిపాలిటీకి కేటాయించిన 66కోట్ల నిధుల్లో సుమారు 4.5కోట్ల అంచనా వ్యయంతో నూతన మున్సిపల్ కార్యాలయ భవనాలను నిర్మిస్తున్నారు. గతంలో ఉన్న పాత పంచాయతీ కార్యాలయం స్థానంలో కొత్త మున్సిపల్ కార్యాలయంను నిర్మిస్తున్నారు. త్వరగా పనులు ముగించి నూతన భవనాన్ని ప్రజలకు సాధ్యమైనంత త్వరగా అందుబాటులో తెస్తామని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ తెలిపారు.

## పర్యావరణ పరిస్థితులపై అవగాహన అవసరం

: ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద

వెదురుకుప్పం, అక్టోబర్ 26 ప్రభాతవార్త



పర్యావరణ పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద పేర్కొన్నారు.గురువారం కళాశాలలో హరిత గృహప్రభావం మరియు ఓజోన్‌పొర క్షీణత అనే అంశం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.కార్యక్రమంకు కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలరసాయన శాస్త్ర అధ్యాపకులు హరిబాబు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో పర్యావరణం పై స్పృహ కలిగించే కార్యక్రమం ఏర్పాటుచేయడం మంచిదన్నారు. పర్యావరణం కాలుష్యం పై అవగాహన కలిగి బాధ్యతగా వ్యవహారిస్తారని తెలిపారు. హరిత గృహ ప్రభావం అంటే భూమి,చుట్టూ ఉన్న వాతావరణం వేడెక్కడం దీని వలన అకాల వర్షాలు, ధ్రువాలలో ఉన్న మంచు కరిగిపోయి సముద్రమట్టం పెరిగి భూమి పైనున్న తీర ప్రాంతాలు ముంపుకు గురై ప్రజలు జనావాసాలను కోల్పోతారన్నారు. వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్, నీటి ఆవిరి భూమి వేడెక్కడానికి కారణం అవుతాయని తెలిపారు. అనంతరం ముఖ్యఅతిధి హరిబాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభాకరరావు, సరిత, వెంకటేష్, చంద్రబాబు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు చంద్రగ్రహణంతో అర్ధగిరి ఆలయం మూసివేత

తవణంపల్లె, అక్టోబర్ 26 ప్రభాతవార్త:

చంద్రగ్రహణం సందర్భంగా అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయాన్ని ఈనెల 28(శనివారం)న మూసి వేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ పి.సురేంద్రారెడ్డి, ఎన్.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 28న రాత్రి 1.05 గంటలకు చంద్రగ్రహణం సంభవిస్తున్నట్లు తెలిపారు. దీనితో ఈనెల 28న సాయంత్రం 5 గంటల నుండి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి గ్రహణానంతరం 29న ఉదయం 5 గంటలకు ఆలయాలు తెరచి ఆలయశుద్ధి,పుణ్యాహావాచనం, గ్రహణ శాంతి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఇదిలా వుండగా ఆలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సుదర్శనహోమం, రాత్రి 8 గంటలకు జరిగే ప్రాకారోత్సవం, భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం కార్యక్రమంను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులు గమనించి సహకరించాలని ఆలయ ఛైర్మన్,ఈఓలు తెలిపారు.

## పేదలకు ఉత్తమ వైద్యం అందించుటకే జగనన్నఆరోగ్య సురక్ష

-ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

కుప్పం, అక్టోబర్ 26 ప్రభాతవార్త



రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ఉత్తమ వైద్యసేవలు అందించుటకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధి మోడల్ కాలనీలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వారు సందర్శించారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు జరిపి తగు మందులు, మాత్రలు అందిస్తారన్నారు. దీనికితోడు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సైత ం నిర్వహించడం జరుగుతోందన్నారు. 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలోని వ్యక్తికి వైద్య పరీక్షలు నిర్వహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎస్‌డి హాఫీజ్, డా॥ సుభాష్ రాజా, కౌన్సిలర్లు రంగయ్య, జగన్, మోహన్‌రాం, నాగరాజు, సయ్యద్ అలీ, రాజ్‌కుమార్, ఎంఆర్ సురేష్, నేతలు మోహన్, సుబ్రమణి, ఇలియాజ్, జీలాని, షాకీర్, నసీర్, నవాజ్, శీన, రోషన్, జతిన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా ఉంటాం.. ఆదరించి ఆశీర్వదించండి

- ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా పద్మిని

- విస్తృతంగా జగనన్నతో జనం.. భరతన్నతో మనం కార్యక్రమం

కుప్పం, అక్టోబర్ 26 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గ ప్రజలకు తాము అన్ని విధాలా అండగా ఉంటామని వచ్చే ఎన్నికల్లో కుప్పం ను ంచి ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీ భరత్‌ను ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గాపద్మిని ఠాకూర్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధి 1,2వార్డుల్లో జగనన్నతో జనం,భరతన్నతో మనం కార్యక్రమంను ఆమె నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు పసుపు,కుంకుమ,సారె అందించారు. నాలుగున్నర ఏళ్లలో ప్రజలకు అందిన పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపిస్తే కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రజల కష్టసుఖాల్లో తాము పాలుపంచుకుంటామని పేర్కొన్నారు.గత ఎన్నికల్లో తమను గెలిపించకపోయినా ప్రజలకు అండ గా నిలిచామన్నారు. ప్రజల కోసమే ఎమ్మెల్సీ భరత్ కుప్పంలో నివాసం ఉంటూ అందుబాటులో ఉన్నారన్నారు. కుప్పంను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, మాజీ పిపిసిఎస్ ఛైర్మన్ పత్రాల మునిరత్నం, సలహాదారు ఆర్.శ్రీనివాసులు, కౌన్సిలర్లు జగన్, మునిరాజు,ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, స్థానిక నేతలు, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ గంగమ్మ పూజ మహోత్సవం

వి.కోట, అక్టోబర్ 26 ప్రభాతవార్త



మండలంలోని ఎస్.బండపల్లిలో శ్రీ గంగమ్మ పూజ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి హాజరై అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పూజాసామగ్రిని సమర్పించి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఎఎం రంగనాథ్, నేతలు రాంబాబు, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అమృత్ సరోవర్‌ను పరిశీలించిన జలశక్తి అభియాన్ కమిటీ

చౌడేపల్లి, అక్టోబర్ 26 ప్రభాతవార్త



మండలంలోని రెండు పంచాయతీల్లో అమలులోవున్న ఉపాధి, వాటర్‌షెడ్ పనులను కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ బృందం పరిశీలించింది. గురువారం ఆమినిగుంట, గడ్డంవారిపల్లి పంచాయతీల్లో వర్షపునీరు సంరక్షణ, చెరువుల పునరుద్ధరణాభివృద్ధి, అమృత్‌సరోవర్, చెక్‌డ్యాముల అభివృద్ధి పురోగతిని కమిటీ బృందం పరిశీలించింది. అమృత్ సరోవర్ చెరువు నిర్మాణానికి స్థలమిచ్చిన రైతు కె.వీరాస్వామి, కస్తూరమ్మ దంపతులను కమిటీబృందం సన్మానించింది. కమిటీ నోడల్ అధికారి సచీంద్రకుమార్‌పట్నాయక్, శాస్త్రవేత్త సోమరేంద్రోసింగ్, డ్వామా పిడి గంగాభవాని, వాటర్‌షెడ్ అదనపు పిడి ఉమాదేవి, ఎపిడిలు సునీల్, శ్రీనివాసులు, గడ్డంవారిపల్లి, పరికిదొన, ఆమినిగుంట వాటర్‌షెడ్ ఛైర్మన్‌లు జయమ్మ, చలపతినాయుడు, సుబ్బరాజు, సర్పంచులు భాగ్యవతి, లక్ష్మీదేవి, సావిత్రి, ఎంపిటీసీ తొండా శ్రీరాములు, మల్లీశ్వర్‌రెడ్డి, బాబు, రైతులు పాల్గొన్నారు.

## గడ్డివామి దగ్ధం : రూ. 50వేలు ఆస్తినష్టం

చౌడేపల్లి, అక్టోబర్ 26 ప్రభాతవార్త



గడ్డివావి దగ్ధమై రూ. 50వేలు ఆస్తినష్టం సంభవించిన సంఘటన గురువారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధిత రైతు కథనం మేరకు...మండలంలోని కాగతి పంచాయతీ మర్రిమాకులపల్లిలోని రాములవారి దేవాలయం వెనుక వైపు వెంకటప్పకు చెందిన గడ్డివామి వుంది. గ్రామానికి చెందిన కొందరు చిన్నపిల్లలు బాణాసంచా పేల్చడంతో గడ్డివామికి నిప్పంటుకొంది. గుర్తించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసేలోపే గడ్డివామి పూర్తిగా కాలిబూడిదైంది. పుంగనూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది తరలివచ్చి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చౌడేపల్లి, అక్టోబర్ 26 ప్రభాతవార్త



స్కూటర్ అదుపుతప్పి కిందకు పడటంతో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-తిరపతి ప్రధాన రహదారిలో తిరుపతి వైపు వెళుతున్న స్కూటర్ ఆమినిగుంట స్టేజీవద్దకు రాగానే ఎదురుగా వెళుతున్న వ్యక్తిని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తోటకురపల్లికి చెందిన సుబ్రమణ్యం(45), ముదిరెడ్డిపల్లికి అంకమ్మ(42)లకు గాయాలయ్యాయి. వారిలో సుబ్రమణ్యంకు బలమైన గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని 108సేవల ద్వారా పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, అక్టోబర్ 26 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు గంగాధర నెల్లూరు మండలం నందనూరుకు చెందిన పూర్ణచంద్ర అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరి ంటెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వైఎస్సార్ బీమా అందజేత

పెళ్లకూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త



పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి గుంటపూడి చెంగయ్య (48) ఇటీవల మృతిచెందారు. ఈ నేపథ్యంలో గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు మృతుని భార్య గుంటపూడి అనురాధకు వైఎస్సార్ బీమా నగదు తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేశారు. వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయలు మంజూరైనట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పొలంరెడ్డి శేఖర్‌రెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు వెంకటరత్నం, నాయకులు ఆరూరు సుబ్బరాఘవయ్య, రఘునాయుడు, గోపాల్, జితేంద్ర, యువనాయకులు మట్టేపాటి చెంగయ్య,చిన్నంబేటి మునిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

కోట, అక్టోబర్ 26 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి లో గురువారం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం టేబుల్ టెన్నిస్ పురుషులు, మహిళలకు ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు జెఎన్‌టియు అనంత పురం పరిధిలోని ఏడు జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల నుంచి 75 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జెఎన్‌టియుఎ అనంతపురం స్పోర్ట్స్ బోర్డు సెక్రటరి బి.జోజిరెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ ఎంపికకు న్యాయ నిర్ణేతలుగా ప్రొఫెసర్ ఎన్.నటరాజ్ సురేష్, శ్రావణ్‌కుమార్‌లు వ్యవహరించారు. మహిళా జట్టు తరపున నికిత, లక్ష్మి, అంకిత, ప్రత్యూష్, గ్రేస్, అంజలి ఎంపిక కాగా, పురుషుల విభాగంలో ఆర్.మోహన్, ఎస్‌విఎన్ కృష్ణ, బి.సాయికృష్ణ, ఎస్ఎ ప్రియామ్, బి.జయచంద్రలు ఎంపికయ్యారు. ఈ జట్టుకు ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యానగర్‌లో పదిరోజుల పాటు కోచింగ్ ఇవ్వనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. జెఎన్‌టియు ఆరపున టేబుల్ టెన్నిస్ టీమ్ రెండోసారి నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ఇకమీదట అన్ని టీమ్‌ల సెలక్షన్ ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలోనే జరుగుతాయని డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.

## శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించరా

కోట, అక్టోబర్ 26 ప్రభాతవార్త

కోట మండలం తిమ్మానాయుడుపాలెం గ్రామంలో శ్మశానాలను ఆక్రమించుకున్నారని, అనేకసార్లు అధికారులకు తెలియజేసినా ఎలాంటి ప్రయోజనం లేదని ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఆనందమూర్తి తెలిపారు. ఆయన గురువారం తిమ్మానాయుడుపాలెంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్పందన, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా చిన్నపాటి సమస్యను పరిష్కరించడం లేదని ఆరోపించారు. మరోపక్క జిల్లా కలెక్టర్ గ్రామ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని పదేపదే వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా మండల స్థాయి అధికారులను హెచ్చరిస్తున్నా ఈ మండలంలో అధికారులకు చలనం లేకుండాపోయిందని విమర్శించారు. శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించాలని ఆర్డీఓకి ఫిర్యాదు చేసినా దిక్కులేదన్నారు. ఈ ప్రభుత్వంలో చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని విమర్శించారు.

## ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సుధాకర్ రెడ్డి

వెంకటగిరి, అక్టోబర్ 26, ప్రభాతవార్త



వెంకటగిరి రెండో ఎస్ఐగా సుధాకర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విఆర్ నుండి ఆయన వెంకటగిరికి బదిలీ అయ్యారు. రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ ఛైర్మన్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రామ్ కుమార్ రెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని ఎస్సై అందజేసారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య, ఈవ్ టీజింగ్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెడతానని ఎస్ఐ తెలిపారు.

## అక్రమ కేసులు పెట్టి చంద్రబాబుని ప్రభుత్వం ఇబ్బంది పెడుతోంది

డాక్టర్ మస్తాన్ యాదవ్

వెంకటగిరి, అక్టోబర్ 26, ప్రభాతవార్త




మాజీ సిఎం చంద్రబాబు నాయుడు పై వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని మస్తాన్ యాదవ్ చాట్ బోర్డ్ ట్రస్ట్ ఛైర్మన్ టిడిపి నేత డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్ తెలిపారు. వెంకటగిరి మండలం చెలికంపాడు గ్రామంలో చేయి చేయి కలుపుదాం చంద్రన్నకు మద్దతు తెలుపుదాం అని కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించారు. వైసిపి చారిటబుల్ ట్రస్ట్ స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడ్డారని ఎలాంటి ఆధారాలు లేవన్నారు. అక్రమ కేసులు పెట్టి చంద్రబాబు నాయుడు ఇబ్బంది పెడుతున్నట్టు తెలిపారు. చంద్రబాబు నాయుడికి అందరూ మద్దతుగా నిలబడాలని కోరారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో అందరూ టిడిపికి మద్దతుగా నిలవాలని కోరారు. ఇంటింటికి వెళ్లి ఆయన కరపత్రాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రామచంద్రయ్య, నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బాలాయపల్లెకి ధర్మ ప్రచార రథయాత్ర రాక

ఈవో జనార్ధన్ రెడ్డి

బాలాయపల్లి, అక్టోబర్ 26, ప్రభాతవార్త

పెనుశీల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం పెంచలకోన వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 27న బాలాయపల్లికి చేరుకోనున్న ధర్మ ప్రచార రథయాత్ర వస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి కె. జనార్ధన రెడ్డి తెలిపారు. శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ధర్మ ప్రచార రథయాత్ర సాయంత్రం 6 గంటలకు కళ్యాణం, పురాణ ప్రవచనాలు, అన్నమాచార్య కీర్తనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్మ ప్రచార రథయాత్రకు సహాయ సహకారాలు తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అందిస్తున్నట్లు వివరించారు. కళ్యాణాన్ని తిలకించి పాల్గొన్న భక్తులకు కల్యాణ తలంబ్రాలు, పసుపు, కుంకుమ, తీర్థప్రసాదాలు అందిస్తామని తెలిపారు. శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం పెంచలకోన వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 28న డక్కిలికి చేరుకోనున్న ధర్మప్రచార రథయాత్ర చేరుకుంటుందని కార్యనిర్వహణాధికారి కె. జనార్ధన రెడ్డి వివరించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ధర్మ ప్రచార రథయాత్ర ఉదయం 9 గంటలకు స్వామి అమ్మవార్ల కళ్యాణం, పురాణ ప్రవచనాలు ఉంటాయన్నారు. కల్యాణాన్ని తిలకించి పాల్గొన్న భక్తులకు కల్యాణ తలంబ్రాలు, పసుపు, కుంకుమ అందజేస్తామని వివరించారు. ధర్మ ప్రచార రథయాత్రకు తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు.

## గంజాయి విక్రేత అరెస్ట్

1.5 కేజీల గంజాయి స్వాధీనం



గూడూరు, అక్టోబర్ 26, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని అరుంధతి పాలెంలో సెబ్ సాధారణ తనిఖీల్లో భాగంగా గంజాయి కలిగిన వ్యక్తిని అరెస్ట్ చేశామని సెబ్ సిఐ విజయ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సెబ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెబ్ సాధారణ తనిఖీల్లో భాగంగా గూడూరు పట్టణంలోని గమల్ల పాలెంకి చెందిన గంపాల మస్తానయ్య అరుంధతి వాడలో గంజాయి విక్రయిస్తుండగా అరెస్టు చేశామన్నారు. అతని దగ్గర సుమారు 1.5 కెజిల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇతను ఒడిశా రాష్ట్రంలోని చిత్తకొండ గ్రామ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి దగ్గర 3 వేల రూపాయిలకు 2 కేజీలు గంజాయి కొనుగోలు చేశారన్నారు. 1.5 కేజీ గంజాయిని అరుంధతి పాలెంలో అమ్మడానికి, ప్రయత్నిస్తుండగా సమాచారం మేరకు అరెస్టు చేశామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు, గంజాయిని విక్రయిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శేషమ్మ, సిబ్బంది రామ్ ప్రసాద్, రమేష్, ఆనంద బాబు, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేద అర్చక కుటుంబానికి ఆర్థిక చేయూత

వాకాడు, అక్టోబర్ 26, ప్రభాతవార్త



సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం వాకాడు మండలం వాలమేడు గ్రామంలో ఇటీవల మృతి చెందిన పేద బ్రాహ్మణ మహిళ తిరువుత్తూరు రేణుకమ్మ ఉత్తరక్రియల కోసం వారి కుటుంబ సభ్యులకు సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు, శ్రీరామ సేన అధ్యక్ష, కార్యదర్శులు హరీష్ రెడ్డి, శివకుమార్ చేతుల మీదుగా దాతలు వసంత రెడ్డి, బలరామిరెడ్డి, ఫలసరుకులు, బియ్యం, కూరగాయలు, ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా దీవి అనంతబాబు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన దివంగతురాలు తిరువుత్తూరు రేణుకమ్మకు గతంలో కూడా సంస్థ తరపున ఆర్థిక సాయం అందించామని, వారు గతించిన తదుపరి వారి ఉత్తరక్రియల కోసం దాతల దాతృత్వంతో వారి కుటుంబ సభ్యులకు తొమ్మిది వేల రూపాయిల ఆర్థిక చేయూతను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అవధానం మురళి, పంత్రంగం మస్తాన్, ముత్తుకూరు మోహనరావు, శంకర గణేష్, సాయి లోకేష్ పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూపుదాం-జగన్‌రెడ్డిని సిఎంగా చూద్దాం

చౌడేపల్లి, అక్టోబర్ 26 ప్రభాతవార్త



అభివృద్ధిని చూపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని చూద్దామని పలువురన్నారు. గురువారం మండలంలోని ఎ.కొత్తకోట, దుర్గసముద్రం, చారాల, శెట్టిపేట, ఆమినిగుంట, గడ్డంవారిపల్లి, పరికిదొన పంచాయతీల్లోని సచివాలయాల్లో " ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే " అన్న అంశంపై శిక్షణా తరగతులను ప్రారంభించారు. గడచిన 4యేళ్ళల్లో ప్రభుత్వం అమలు పరచిన అభివృద్ధి-సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి వైకాపా ప్రభుత్వం గద్దెనెక్కించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అదే విధంగా రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిల ఆధ్వర్యంలో పుంగనూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించి, రాబోయే ఎన్నికల్లో అఖండ మెజార్టీని చూపించాలన్నారు. జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, వైకాపా మండలాధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ రవిచంద్రారెడ్డి, హెచ్‌డిఎస్ ఛైర్మన్ కళ్యాణభరత్, సర్పంచులు ఓబుల్‌రెడ్డి, విజయకుమారి, సరస్వతమ్మ, భాగ్యలత, లక్ష్మీదేవి, ఎంపిటీసీ తొండా శ్రీరాములు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వరదా గోవిందయ్య, జెసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి స్వర్ణ ప్రషన్ టాబ్లెట్లు

### గ్రూప్ పొడక్ట్ మేనేజర్ ఎథికల్స్ సుమన్ ముఖర్జీ

తిరుపతి టౌన్, అక్టోబర్ 26, ప్రభాతవార్త




పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి డాబర్ సంస్థ స్వర్ణ ప్రషన్ టాబ్లెట్లను తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చేయడం జరిగిందని డాబర్ ఇండియా లిమిటెడ్, గ్రూప్ ప్రొడక్ట్ మేనేజర్ ఎథికల్స్ సుమన్ ముఖర్జీ తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుమన్ ముఖర్జీ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద సైన్స్ ఆధారిత ఆయుర్వేద సంస్థ డాబర్ ఇండియా లిమిటెడ్ తిరుపతి వేదికగా 18వ ఆయుర్వేద పర్వలో భాగంగా విప్లవాత్మక పురోగతి ఉత్పత్తిగా స్వర్ణ ప్రషన్ టాబ్లెట్‌ను ప్రారంభించిందన్నారు. డాబర్ సంస్థ 139 సంవత్సరాల ఆయుర్వేద ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. పిల్లల్లో మేధో శక్తిని పెంచడానికి, రోగ నిరోధక శక్తిని పెంచడానికి ఈ స్వర్ణ ప్రషన్ టాబ్లెట్లు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. భారత ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా ఆమోదించబడిన ఈ స్వర్ణ ప్రషన్ టాబ్లెట్లును పుట్టిన బిడ్డ నుండి 16 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు ప్రతి మాసంలో వచ్చే పుష్యమి నక్షత్రం రోజున అందించాలన్నారు. ఈ టాబ్లెట్ ద్వారా పిల్లల్లో మానసిక ఎదుగుదల అద్భుతంగా పనిచేస్తుందని చెప్పారు. ఈ నెల 27 నుండి 29 వరకు నిర్వహించే 18వ ఆయుర్వేద పర్వ సదస్సులో అభ్యాసకులకు, వినియోగదారుల కోసం ప్రత్యేక సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. సనాతన భారత వైద్య విధానాన్ని ప్రతి ఒక్కరికి చేరువ చేయాలనే లక్ష్యంతో డాబర్ సంస్థ అహర్నిశలు శ్రమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ దినేష్ కుమార్, అసిస్టెంట్ సేల్స్ ఆఫీసర్ వెంకట్రాజు పాల్గొన్నారు.

# కళ్ళ ముందు సత్యం .. కనికరించని వైనం

ఇంటి స్థలం ఆక్రమణపై బాధితురాలి ఫిర్యాదు
దిక్కున్నచోట చెప్పుకోమంటున్న ఆక్రమార్కులు
చేతులెత్తేసిన పంచాయతీ, పోలీసు యంత్రాంగం
పక్షవాతంతో బాధపడుతున్న బాధితుడు

చంద్రగిరి, అక్టోబర్ 26 ప్రభాతవార్త:




కళ్ళ ముందు సత్యం బోధపడుతున్నప్పటికీ కనికరించని అధికారుల తీరు బాధితుల దౌర్భల్యాన్ని మరింత దుర్భరం చేస్తున్నది. పక్షవాతంతో పనిచేసుకోలేని భర్త దుస్థితి ఒకవైపు, అయ్యో పాపం అన్నందుకు తమకే చుట్టుకున్న పాపం మరో వైపు వేధిస్తున్న తీరు ఆ దంపతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. వివరాల్లోకెళితే.. చంద్రగిరి పాతపేటకు చెందిన బాధితులు ప్రభారాణి, సుధాకర్ దంపతులు తమ ఇంటి స్థలం ప్రక్కన వేరొకరు ఇంటి నిర్మాణం చేపట్టే క్రమంలో తమ స్థలంలో ఇసుక, ఇతర సామాన్లు పెట్టుకుని పనిచేసుకుంటామని సదరు మేస్త్రి రిక్వెస్ట్ చేయడంతో అంగీకరించారు. అయితే నిర్మాణం చేపట్టిన ఇంటి యజమాని, అతని సోదరుడు కలసి ప్రక్కనున్న ఫ్లాట్ (రాతికూసాలు) హద్దులు చెరిపేసి కొంత మేరకు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారు. తమ హద్దులు చెరిపేయడంపై ఆమె నిలదీయడంతో మీ కొలతలు చూపించే తమ స్థలంలో నిర్మాణం చేపడతామంటూ నమ్మబలికారు. చివరికి సుమారు ఒకటిన్నర అడుగు మేరకు ఆక్రమించడంతో బాధితురాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఇంటి నిర్మాణం చేపట్టిన అన్నదమ్ములు "నీకు దిక్కున్న చోట చెప్పుకో" పనులు ఆపేది లేదంటూ బెదిరించడంతో ఒక్కసారిగా షాక్ గురయ్యింది. దీంతో చేసేది లేక ముందుగా రెవెన్యూ, పంచాయతీ, పోలీసు విభాగాలకు అర్జీలు అందజేసింది. తహశీల్దార్ శిరీషా ఆదేశాల మేరకు మండల సర్వేయర్ పురుషోత్తం రెడ్డి ఇక్కడికి చేరుకుని హద్దులను నిర్ణయించినప్పటికీ ఆక్రమితదారులు దౌర్జన్యమే పెట్టుబడిగా పనులు చేపట్టారు. బాధితురాలు నిస్సహాయ స్థితిలో 100కు కాల్ చేయడంతో పోలీసులు వచ్చి ఆక్రమిత స్థలంలో పనులు ఆపాలని సూచించారు. అయినా పనులు ఆపకుండా చేస్తూనే వుండటంతో మరోమారు మండల సర్వేయర్‌ను స్థలం వద్దకు తీసుకువచ్చి ఆయన చూపిన మేరకు హద్దుల్లో రాతి కూసాలు నాటేందుకు యత్నించగా ఆక్రమిత వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు బాధితురాలిని నిర్దాక్షిణ్యంగా గెంటేశారు. ఈ క్రమంలో మరో మారు 100కు కాల్ చేయడంతో పోలీసులు ఇరు పార్టీలను స్టేషన్‌కు వచ్చి సిఐ రాజశేఖర్‌కు డాక్యుమెంట్లు చూపాలని సూచించారు. బాధితురాలు డాక్యుమెంట్స్‌తో పాటు మండల సర్వేయర్ రిపోర్టు చూపినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో ఇతర కేసులు, ధర్నాల కారణంగా సిఐ దాదాపు పక్షం రోజులు అందుబాటులో లేకపోవడంతో బాధితులు పోలీస్ స్టేషన్‌కు తిరగడం మినహా న్యాయం జరగలేదు. బాధితులకు న్యాయం చేయడమా లేదంటే కేసు నమోదు చేయడమా జరిగి వుండాలి కానీ ఆ మేరకు ఇక్కడ చర్యలు శూన్యమయ్యాయి. వాస్తవానికి ప్రస్తుత డిఎస్పీ డాక్టర్.టి.డి.యశ్వంత్ బాధ్యతలు చేపట్టిన రోజున చెప్పిన విధంగా వృద్ధులు, మహిళలకు మొదటి ప్రాధాన్యతగా న్యాయం చేయాలనే ఆశయానికి ఇక్కడ ఏ మాత్రం ప్రాధాన్యత లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. "సిఐ రాజశేఖర్ నిజాయితీ పరులే అయినా బాధితులకు న్యాయం చేయలేని నిజాయితీ దేనికి" పనికొస్తుందో ఆలోచించుకోవాల్సి వుంది. ఇకనైనా స ంబంధిత స్థలం వద్ద సమస్య పరిష్కారానికి పోలీసులు చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఇదిలా వుండగా చంద్రగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య సైతం ఆక్రమిత నిర్మాణదారులు ఎటువంటి అనుమతులు లేకుండా ఇల్లు నిర్మిస్తున్నప్పటికీ కనీసం బాధితుల ఫిర్యాదుపై స్పందించకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా అక్రమ నిర్మాణం చేపట్టి బాధితులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని ఆక్రమిత స్థలంలోని నిర్మాణాలను తొలగించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

# తిరుపతి డివిజన్

## రాకేష్‌రెడ్డిని సత్కరించిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

నగరి, అక్టోబరు 26 ప్రభాతవార్త:



రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి రాకేష్‌రెడ్డిని నగరి పట్టణానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. గురువారం తిరుపతికి వెళ్లిన బాబు తనకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పదవిని అందించడంలో సహకరించినందుకు రాకేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి నిస్వార్థంగా పని చేసిన వ్యక్తికి ఉన్నత పదవిని ఇప్పించడం అభినందనీయమంటూ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాకేష్‌రెడ్డికి గజమాలలు, శాలువలు వేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు అల్లాపిచ్చి, రూరల్ అధ్యక్షుడు కుమార్, నాయకులు దేశయ్య, వెంకటేష్, మదన్, చిన్ని, గోపాల్, సతీష్, విజయ్, బాబు, హరీష్‌కుమార్, ధనంజయలు, దేవన్ ఏసు, తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యం కోరల్లోంచి మా గ్రామాన్ని కాపాడండి

-తహసిల్దార్‌కు తొండుకులి గ్రామస్తుల వినతి

సత్యవేడు, అక్టోబర్ 26, ప్రభాతవార్త :



మండలంలోని మదనంజేరి పంచాయితీ తొండుకులి గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం బిఎల్ఎం సిమెంట్ కంపెనీని ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. ఈ కంపెనీ వల్ల కాలుష్య కోరల్లో చిక్కుకున్న తమ గ్రామాన్ని కాపాడాలంటూ గురువారం గ్రామస్తులు స్థానిక రెవిన్యూ కార్యాలయంలో తహసీల్దార్ షేక్ జరీనాకు వినతిపత్రం అందజేశారు. బిఎల్ఎం కంపెనీ నుండి వెలువడే మురికినీరు విచ్చలవిడిగా పంటకాలువల్లోకి, చెరువుల్లోకి వదిలేస్తుండటం వల్ల ఆనీరు త్రాగిన పశువులు రోగాలభారిన పడుతున్నాయని, దుమ్ము, దూళితో గ్రామ పరిసరాలు, పంటపొలాలు దుమ్ము, దూళితో నిండిపోయి ఇబ్బందులను ఎదుర్కోంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కంపెనీని మూయించి తమ గ్రామాన్ని కాలుష్యం భారిన నుండి బయటపడేయాలని వారు విన్నవించుకున్నారు. గ్రామస్తుల వినతి పట్ల సానుకూలంగా స్పందించిన తహసిల్దార్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఏర్పేడును సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతాం

ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్), అక్టోబర్ 26 ప్రభాతవార్త



ఏర్పేడు మండల కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుటకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ నల్లపాళెం శివయ్య అన్నారు. గురువారం ఏర్పేడులో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గాభివృద్ధికి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కృషి ఎనలేనిదన్నారు. ఏ గ్రామమైనా మండల కేంద్రమైనా ఏర్పేడులో రూ.11.5లక్షలతో సిమెంటు రోడ్డును శాసనసభ్యుడు మంజూరు చేసారన్నారు. ఈ రోడ్డు 203 మీటర్లు ఓం నారాయణ ఇంగ్లీష్‌మీడియం ఉన్నత పాఠశాల నుంచి కమ్మవీధి వరకు నిర్మించుటకు నిర్ణయించామన్నారు. నేడు ఈ రోడ్డు నిర్మాణానికి భూమి పూజలు చేసామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ లక్ష్మయ్య, పంచాయతీరాజ్ ఎఇఇ రవితేజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జయచంద్ర, విద్యాకమిటి చైర్మెన్‌నల్లపాళెం సాంబయ్య, మండల కార్యదర్శి నల్లపాళెం పవన్‌కుమార్, గహాసారధులు నల్లపాళెం షణ్ముఖ సుందరం, చింతమోహన్, మురళి నాయుడు, నారాయణ, కరుణాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఈ క్రాప్‌పై సామాజిక తనిఖీ, గ్రామసభలు

వడమాలపేట, అక్టోబరు 26 ప్రభాతవార్త:



ఈ క్రాప్ నమోదులో ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే సవరించుకోవడానికి సామాజిక తనిఖీ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వడమాలపేట మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ కోరారు. ఖరీఫ్-2023 సీజన్‌లో 2126 మంది రైతులకు 6423 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ క్రాప్ పూర్తి చేయడం జరిగిందన్నారు. మండలంలోని గ్రామాల్లో అన్నిరైతు భరోసా కేంద్రాల వద్ద 26 తేదీ నుంచి 29 వరకు ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనికీ కొరకు ప్రదర్శించబడుతుందని, గ్రామసభలు కూడా నిర్వహించబడతాయని తెలిపారు. ఈ గ్రామసభల్లో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలో ఉన్న రైతుల క్రాప్ నమోదు అన్ని వివరాలను సమగ్రంగా చదివి వినిపించడం జరుగుతుందన్నారు. కావున రైతు సోదరులు మీ రైతు భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీ కొరకు ప్రదర్శించబడిన ముసాయిదా జాబితాను కేంద్రంలో ఉన్న వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలను సంప్రదించి అభ్యంతరాలు రాత పూర్వకంగా తెలియజేయవలసిందిగా కోరారు. ఈ క్రాప్ ఖరీఫ్-2023 సీజన్ సవరణ కొరకు ఇది ఆఖరి అవకాశం. తుది జాబితా ప్రదర్శన తరువాత ఎటువంటి మార్పులు, చేర్పులు చేయబడవని ఆయన తెలిపారు.

## బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం

సత్యవేడు, అక్టోబర్ 26, ప్రభాతవార్త :




ఇటీవల కాలంలో మహిళలు అత్యధికంగా ఎదుర్కోంటున్న బ్రెస్ట్ క్యాన్సర్ పై మండలంలోని రాజగోపాలపురంలో మోండలైజ్ పరిశ్రమ సహకారంతో చిన్న పాండూరు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం, బాలరక్ష భారత్ సంయుక్త నిర్వాహణలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అక్టోబర్-19 అంతర్జాతీయ బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామీణ మహిళల్లో అవగాహన పెంపొందించే దిశగా ఈకార్యక్రమం దోహదపడుతుందన్నారు. బాలరక్ష భారత్ సంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్ బాలాజీ మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్ వాధి లక్షణాలు, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఈకార్యక్రమంలో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ మదన్, ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 29న జరిగే ధర్నాను విజయవంతం చేయండి

తొట్టంబేడు, అక్టోబర్ 26 ప్రభాతవార్త



పాత పెన్షన్ ఇస్తారా? గద్దెదిగుతారా? అన్న నినాదంతో ఈనెల 29వ తేదీన ఎపిటిఎఫ్ 1938 ఆధ్వర్యంలో విజయవాడలో గల ధర్నా చౌక్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని ప్రతి ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మద్యాహ్న భోజన విరామసమయంలో ధర్నాకు సంబందించి గోడపత్రికలను నాయకులు రేగంటిదేవానంద్, మహిళ కార్యదర్శి ఇందిరమ్మ తదితరులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ వద్దు, పాత పెన్షన్ మాత్రమే అమలు చేయాలని, 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులు కు పాత పెన్షన్ వెంటనే అమలు చేయాలని పాఠశాల విద్యను నాశనం చేస్తున్న 117 జివోను రద్దు చేయాలని, మెగా డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయులును నియమించి విద్యా వ్యవస్థ బలోపేతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 11వ పిఆర్‌సి అరియర్స్, డిఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ప్రతి 1వ తేదీన ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. బహిరంగసభకు ప్రతి ఉద్యోగి హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిసిపిఎస్ సంఘ నాయకులు సుబ్బారెడ్డి, శ్రీనాధ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

వడమాలపేట, అక్టోబరు 26 ప్రభాతవార్త:



మండలంలోని ఎస్‌బీఆర్ పురం లెక్కదాఖలోని 287 సర్వే నంబర్లు పక్కన ఉన్నటువంటి భూమిని భూ కబ్జా దారులు ఆక్రమించుకోవడాన్ని నిరసిస్తూ వడమాలపేట తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎంపార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకటేష్, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య మాట్లాడుతూ గతంలో ఆ భూమిలో పేదలు సాగు చేసుకునేవారని, గత 30 సంవత్సరాలుగా ఆధీనంలో ఉండిందన్నారు. గతంలో ఆ భూ ఉంటే దానిని భూ కబ్జా దారులు ఆక్రమించుకోవడం దారుణమన్నారు. గత 30 సంవత్సరాలుగా పేదల ఆధీనంలో ఉందన్నారు. గతంలో ఆ భూములకు డీకేటీ పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా పట్టించుకోలేదని తెలిపారు. పేదల అనుభవంలో ఉన్న ఆ భూమి కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ సుబ్రహ్మణ్యం పేదల భూముల్లో జేసీబీతో మట్టి తోలుతుండగా అక్కడి నుంచి తరిమి వేశారు. న్యాయ విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామూర్తి, భూపాల్, రాజేంద్రన్, నాగూర్, చిన్నపాప, ఏసయ్య, గోపాల్, సరోజ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరులో మేరీ మట్టి - మేరీ దేశ్ కలశ యాత్ర

గూడూరు రూరల్, అక్టోబర్ 26, ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసుల, క్రీడల మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థ నెహ్రూ కేంద్రం తిరుపతి జిల్లా వారి సహకారంతో గూడూరు పురపాలక సంఘం చెన్నూరు 2 బ్లాక్‌కి సంబంధించి గూడూరు చెన్నూరు 2 లో విలేజ్ ఎన్విరాన్మెంటల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఓబి రెడ్డి ఆధ్వర్యంలో మేరీ మట్టి మేరీ దేశ్ కలశయాత్ర చెన్నూరు 2 సచివాలయం నుంచి హైస్కూల్ వరకు డప్పు వాయిద్యాలతో, కోలాహలంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బయోడైవర్సిటీ ఎంబీసీ కోఆర్డినేటర్ మావుడూరు మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు నూతనంగా నిర్మించబడిన పార్లమెంట్ ఆవరణలో అమరవీరుల చిహ్నాలుగా ఉద్యానవనాన్ని ఏర్పాటులో భాగంగా దేశం నలుమూలల నుంచి మట్టిని సేకరించే కార్యక్రమంలో భాగంగా నాయుడుపేట, తరపున మట్టిని కలశంలో సేకరించి ఢిల్లీకి పంపుతామని తెలిపారు. దేశ నలుమూలల నుంచి సుమారు 75 వేల మంది యువతతో ప్రధాని అధ్యక్షతన ఈ నెల 30, 31 తేదీలలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకటేశ్వర రావు, సెక్రెటరీలు, వాలంటీర్స్, ఏఎన్ఎంలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నిజాన్ని గెలిపిద్దా రండి

-నేడు నారాభువనేశ్వరి బహిరంగసభ

తొట్టంబేడు, అక్టోబర్ 26 ప్రభాతవార్త




తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి నారాచంద్ర బాబు నాయుడుపై అసత్య ఆరోపణలతో అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేసిన సంఘటనకు జీర్ణించుకోలేక ప్రాణాలు వదలిన తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులను పరామర్శించి భరోసా కల్పించడానికి 'నిజం గెలవాలి' అన్న కార్యక్రమంలో బస్సుయాత్ర చేస్తున్న నారాభువనేశ్వరి పర్యటనలో భాగంగా నేడు హౌసింగ్‌బోర్డు కాలనీలో ఎదురుగా ఉన్న మైదానంలో నేడు మద్యాహ్నం 3గంటలకు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సతీమణి నారాభువనేశ్వరి పాల్గొనే బహిరంగసభకు పెద్దఎత్తున తెలుగుదేశంపార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని తెదేపా నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి, మిన్నల్‌రవి, నెమళ్ళూరుబుజ్జి, సుబ్బయ్య, సన్నీ, రామకృష్ణయాదవ్, వినయ్, అబ్దుల్‌కరీం, షఫి, మణి, వెంకటేశ్వరచౌదరి, డిల్లీబాబు, మునిరాజయాదవ్, భాస్కర్‌ముదిరాజ్, సునీల్, సాయినాయుడు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రోజు శిక్షణ పొంది రాష్ట్ర స్థాయికి ఎదగాలి

పుత్తూరురూరల్, అక్టోబరు 26 ప్రభాతవార్త:



బాల బాలికల జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్‌క్రీడాకారుల ఎంపిక శ్శారీరకంగాను, మానసికంగాను దృఢంగా ప్రతిరోజు శిక్షణ పొంది రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయికి క్రీడాకారులందరూ ఎదగాలని పుత్తూరు మండల విద్యాశాఖ అధికారి తిరుమలరాజు తెలిపారు. గురువారం పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీల ఎంపిక నారాయణ ప్రధానోపాధ్యాయులు సులోచన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవోమాట్లాడుతూ క్రీడాకారులు చిన్నతనం నుంచి విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, భవిష్యత్‌లో మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని తెలియజేశారు. చిత్తూరు జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జయరామయ్య మాట్లాడుతూ నవంబరు 4వ తేదీ నుంచి ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లా అండర్-17 ఎస్సీఎఫ్ సెక్రటరీ సురేష్‌బాబు తిరుపతి జిల్లా సెక్రటరీ బాబు, ఎస్ఎంసీ చైర్మన్ శరవణ, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు డా. ప్రభాకర్‌రావు, కిషోర్‌కుమార్, సురేంద్ర దేవానంద్, జయప్రకాష్, దశరథ, గోపికృష్ణ, తిరుమలరాజు, నాగేంద్ర, అమ్ములు, అరుణ పాల్గొన్నారు.

## ఎంబీఏ ఫలితాల్లో ఎడ్జ్ ఇంటర్నేషనల్ బీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (క్రీడా), అక్టోబర్ 26, ప్రభాతవార్త




2022 - 23 విద్యా సంవత్సరానికి శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎంబీఏ కోర్సు 4వ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక బంగారుపాళ్యంలోని ఎడ్జ్ ఇంటర్నేషనల్ బి స్కూల్ నందు చదువుతున్న విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల డైరెక్టర్ జి. భాస్కర రెడ్డి తెలియజేసారు. వీరిలో ఎన్. పల్లవి, ఎన్. విశ్వచందన్ రెడ్డి, జి. రవీంద్ర, బీ కీర్తిలు ఉత్తమ ర్యాంకులు సాధించి అత్యుత్తమ ఫలితాలతో మెరిశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్ జి. భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వై. సతీష్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

## బీసీలకు సముచిత స్థానమిచ్చింది వైసీపీనే

### కార్పొరేటర్ ఉమా యాదవ్



తిరుపతి టౌన్, అక్టోబర్ 26, ప్రభాతవార్త

వెనుబడిన తరగతుల వారికి సముచిత ప్రాధాన్యమిచ్చి ఆర్థిక చైతన్యం కలిగించింది ఒక వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీయే అని తిరుపతి నగర పాలక సంస్థ రెండవ డివిజన్ కార్పొరేటర్ ఉమా యాదవ్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సాధికార యాత్ర గురించి వివరాలను నగర పాలక సంస్థ కార్పొరేటర్లు మీడియాకు వెల్లడించారు. సామాజిక సాధికార యాత్ర శుక్రవారం 9 గంటలకు నగర పరిధిలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ప్రారంభమై నగరంలోని అనేక కుడళ్లను తిరిగి బస్టాండ్ వద్దనున్న గ్రూప్ డియేటర్ వద్ద బహిరంగ సభలో ముగుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉమా యాదవ్ మాట్లాడుతూ ఒక్క బిసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి బిసిలు అందరిని ఆదుకున్నామని టిడిపి నాయకులు అనడం అర్థరహితమని, బీసీల్లో ఉన్న ఒప్పుకోలాల అందరికీ ఒక్కో కార్పొరేషన్ ఏర్పాటు చేసి బీసీల ఆర్థిక చైతన్యానికి తోడ్పాటు అందించింది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమేనన్నారు. నగర పాలక సంస్థలు సింహభాగం బీసీల కార్పొరేటర్లుగా ఉన్నారని, పలు ఆలయాలకు బీసీలను చైర్మన్లుగా చేసిన ఘనత సిఎం జగన్‌ది అన్నారు. ఇమామ్లకు గౌరవ వేతనం కోసం పోరాటం చేస్తే దేశ ద్రోహం కేసులు పెట్టిన చరిత్ర చంద్రబాబు ప్రభుత్వాన్ని గుర్తు చేశారు. సామాజిక సాధికార యాత్రకు ప్రతి ఒక్కరూ కలిసి వచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్, కుడితి సుబ్రంణ్యాం, ఆంజనేయులు, సికె రేవతి, మునిరామిరెడ్డి, నరేంద్ర నాథ్, వైసిపి నాయకులు సలీం, ప్రసాద్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల్లో క్రమశిక్షణకే

ముఖ ఆధారిత హాజరు విధానం

తిరుమల, అక్టోబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:



టిటిడిఉద్యోగుల హాజరుకు సంబంధించి ముఖ ఆధారిత హాజరు విధానం (ఫేసియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్)ఇప్పుడు అమలవుతోంది. టిటిడిలోని శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులకు హాజరుకావడానికి ముందు ఈ ముఖగుర్తింపు ఆధారం కానుంది.

## నవంబర్ 1 నుంచి

## ఏపిఎస్ఆర్‌టిసిలో అప్రెంటీస్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు

తిరుపతి రవాణా, అక్టోబర్ 26, ప్రభాతవార్త

ఏపిఎస్ఆర్‌టిసిలో అప్రెంటీస్ ఉద్యోగానికి నవంబర్ 1వ తేది నుంచి 6వ తేది వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నవంబర్ 1వ తేది బుధవారం ప్రకాశం జిల్లాలో, 2వ తేది ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో, 4వ తేది తిరుపతి జిల్లాలో, 6వ తేది చిత్తూరు జిల్లాలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సర్టిఫికేట్స్ వెరిఫికేషన్‌కు హాజరైయ్యే వారు ఐటిఐ అభ్యర్థులు రెస్యూమ్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థి యొక్క ప్రొఫైల్, రిజిష్టర్డ్ నెంబర్, అభ్యర్థి యొక్క పాస్ పోర్ట్ సైజు ఫోటో, ఎస్ఎస్‌సి మార్క్ షీట్, ఐటిఐ మార్క్ షీట్, నేషనల్ ట్రేడ్ సర్టిఫికేట్, పర్మనెంట్ లేదా ఆరు నెలల లోపు జారీ చేయబడిన తాత్కాలిక కుల ధృవీకరణ పత్రం, వికలాంగులైనచో దృవీకరణ పత్రం, మాజీ సైనికోద్యోగుల పిల్లలైనచో దృవీకరణ పత్రము, ఎన్‌సిసి, స్పోర్ట్స్ ఉన్నచో సంబంధిత దృవీకరణ పత్రములు, అభ్యర్థి యొక్క ఆధార్ కార్డు, సర్టిఫికేట్స్ వెరిఫికేషన్ రుసుము రూ. 118, రుసుము 100, జిఎస్‌టి 18 రూపాయిలు రుసుము చెల్లించి తగిన రశీదు తీసుకోవాలని తెలిపారు. ఒరిజనల్ సర్టిఫికేట్స్, నకలు తీసుకురాని యెడల, వారిని ఇంటర్వ్యూకు ఎట్టి పరిస్థితులలో అనుమతించబడదన్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల, ఏపిఎస్ఆర్టిసి కాకుటూరు, నెల్లూరుకు అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు.

## నిత్యాన్నదాన ప్రసాదానికి విరాళం

తొట్టంబేడు, అక్టోబర్ 26 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కర్నాటకకు చెందిన భక్తులు విరాళాన్ని అందించారు. గురువారం కర్నాటక ఉడిపికి చెందిన గణేష్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును కలసి తాము నిత్యాన్న ప్రసాదానికి విరాళం ఇవ్వాలని భావిస్తున్నట్లు వివరించారు. ఈమేరకు వారు రూ.40వేల ను నిత్యాన్న ప్రసాదానికి అందించగా వారికి స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో గణేష్‌తో పాటు ఆలయానికి చెందిన సుదర్శనం పాల్గొన్నారు.

# నేటి అసంఘటిత కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్**



గూడూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త : ఈ నెల 27న నెల్లూరు జిల్లాలో జరిగే అసంఘటిత కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని గూడూరు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికులు అధిక సంఖ్యలో అసంఘటిత రంగం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం న్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ రంగం వ్యవసాయ కార్మికులు హమాలీ ఆటో లారీ ట్యాక్సీ ప్రైవేట్ ట్రావెల్స్ షాపింగ్ మాల్స్ స్కీం వర్కర్స్ మున్సిపల్ వర్కర్స్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రైవేట్ పరిశ్రమలు తదితర రంగాల్లో పనిచేసే వీరికి ఎటువంటి జీవిత భద్రత లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇ శ్రామ్ రిజిస్ట్రేషన్ పనులు రాష్ట్ర వ్యాప్తంగా నత్తనడకన సాగుతున్నాయని ఎద్దేవా చేశారు. 1.51 కోట్ల రిజిస్ట్రేషన్ల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 80 లక్షలు మాత్రమే పూర్తి చసినట్లు అధికారిక లెక్కలే చెబుతాయన్నారు. సుమారుగా 52.70 శాతం మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయిందన్నారు. ఇశ్రామ్‌లో నమోదైన వారికి ఇప్పటి వరకు నిబంధనల మేరకు నష్ట పరిహారం అందుతున్న దాఖలాలు కూడా కనిపించడం లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అసంఘటిత రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారందరికి చట్టప్రకారం రావాల్సిన ప్రయోజనాలు రాబట్టుకునేం దుకు అందరం ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అసంఘ టిత రంగం పై ఆధారపడి జీవిస్తున్న వారందరిని ఐక్యం చేయాలనే లక్ష్యంతో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు గూడూరు నియోజకవర్గంలోని అసంఘటిత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య, పట్టణ కార్యదర్శి సురేష్, పామంజి మణి, చంద్రయ్య, కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి అడపాల ప్రసాద్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పుట్టా శంకరయ్య, మున్సిపల్ వర్కర్స్ నాయకులు గోపి, కోటి తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 10లోపు అందుబాటులోకి క్రికెట్ స్టేడియం :కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 26 ప్రభాతవార్త : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గొల్లవాని గుంట వద్ద నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం నవంబర్ 10వ తేది లోపు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. గురువారం గొల్లవాని గుంట వద్ద నిర్మాణంలో వున్న క్రికెట్ స్టేడియం పనులను కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు ముఖ్యంగా క్రికెట్ క్రీడాకారులకు ఉఅందుబాటు లోకి వచ్చేలా టర్ఫ్ మ్యాట్ క్రికెట్ క్రీడలు నిర్వహించేలా నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం పనులను నవంబర్ 10వ తేది లోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అదే విధంగా స్టేడియం లోనే నిర్మిస్తున్న వాకింక్ ట్రాక్‌ను పరిశీలించి తగు సూచనలు జారీ చేసారు. ప్రజలు సౌకర్యవంతంగా నడిచేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డీఈ విజయకుమార్‌రెడ్డి, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

## మంత్రి అమర్నాథ్‌ని కలిసిన ఎమ్మెల్యే వెలగపల్లి



గూడూరు, అక్టోబర్ 26 ప్రభాతవార్త : విజయవాడలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌ని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు మంత్రి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు మాట్లాడుతూ గూడూరు పట్టణంకి ఆటో నగర్ ఇచ్చినందుకు మంత్రికి గూడూరు ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. మొట్టమొదటి సారిగా దివంగత నేత గౌతమ్ రెడ్డి పరిశ్రమలు శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మా గూడూరుకి ఉద్యోగ వసతులు కల్పించటానికి మాకు ఒక ఎంఎస్ఎం పార్క్ చిన్న పరిశ్రమలకు పార్క్ ఇవ్వవల్సిందిగా కోరారు. ఆయన హామి ఇవ్వడం జరిగిందన్నారు. దానిలో భాగంగా గూడూరు రూరల్‌లో చాలా స్థలం ఉందని వంద ఎకరాలు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ చెప్పిన తరువాత పారిశ్రామిక డిపార్ట్మెంట్ నుండి ఏడి పరిశ్రమల శాఖ అధికారులు వచ్చి సూచన చేసిన తరువాత ఒక ప్రపోజల్ పంపిచటం జరిగిందన్నారు. ఆ ప్రపోజల్ ప్రకారం వంద ఎకరాలు ఎంఎస్ఎం ఈ పార్క్‌కి గూడూరు రూరల్‌లో దివిపాళెంలో మేము ఇస్తాము అందుకనే అక్కడ పార్క్ ఇవ్వవల్సిందిగా మేము కోరినప్పుడు తప్పనిసరిగా మేము చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గూడూరులో ఎంఎస్ఎం ఈ పార్క్ రావటం, దానితో పాటు చిల్లకూరు మండల పరిధిలోని వరగలి క్రాస్ రోడ్డు నుండి నేరుగా దివిపాళెం ఆటో నగర్ వరకు నూతన రోడ్డు వస్తుందన్నారు. అది చాలా సౌకర్యంగా ఉంటుందన్నారు. ఎవరు కూడా పట్టణంలోకి వెళ్ళివల్సిన పని లేదన్నారు. అలాగే అక్కడ ఉన్న వైఎస్ అర్బన్ లే అవుట్, టిట్కో హౌస్స్, అవీన్ని కూడా నేరుగా నేషనల్ హైవే కలవటానికి ఈ బైపాస్ చిల్లకూరు మీద నుండి దివిపాళెం వరకు ఉంటుందన్నారు. అప్పుడు కొత్త ఆధునికకరమైన గూడూరు వస్తుందన్నారు. ఈ విషయంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. గూడూరు పట్టణంలో ఆటో నగర్, ఎంఎస్ఎం పార్క్ ఏర్పాటుకి సహకరించిన సిఎంకి అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఓంశక్తి ఆలయంలో నవరాత్రి సందర్భంగా
# ప్రత్యేక పుష్పాలంకరణ



నగరి, అక్టోబరు 26 ప్రభాతవార్త: నగరి పట్టణంలో వెలసి ఉన్న మేల్‌మరువత్తూరు ఆది పరాశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విశేష పూజలు జరిగాయి. ఉదయం అభిషేకం, అర్చనలు, 9 గంటలకు కుంకుమ అర్చన, 1008 పుష్పార్చన, మధ్యాహ్నం భక్తులకు సహపంక్తి భోజనం, అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. 54 మంది పేద విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్య పుస్తకం, పెన్సిళ్ళు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు, పంపి ణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు, వ్యాపా రవేత్తలు, అమ్మవారి ఉభయదారులు, మాజీ వైస్ ఎంపీపీ పరశురాం, హరినాయుడు, హేమ లత, వినోద్‌కుమార్, కౌన్సిలర్ బీడీ భాస్కర్, ఇంద్రయ్య, జి.ఎస్.సుబ్రహ్మణ్యం, వెంకటేశులు, ఎస్ఎస్ టెక్స్ రామకృష్ణ, సత్యనారాయణ, మాధవి, ఆదిశివ మురుగానందం, రమేష్‌బాబు, రవి, మోహన్‌రెడ్డి, వీకే ట్రేడర్స్ చిట్టి, వెంకటేశ్వరులు, మంజునాథ కోటి, చంద్రబాబు, బాలాజీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తనపల్లిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

**వార్త ప్రభావం**



తిరుపతిరూరల్, అక్టోబర్ 26 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం తనపల్లి గ్రామ పంచాయతీలో శిధిలావ్యవస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలు కూలడానికి సిద్దంగా ఉన్నాయని 'వార్త' దినపత్రికలో ఈనెల 21 వార్త కథనం ప్రచురితమైన విషయం తెల్సిందే. తనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జెండమాను వీధిలో గృహ అవసరాల నిమిత్తం విద్యుత్ స్తంభం పెచ్చులూడి కూలడానికి సిద్దంగా ఉందని, అదేవిధంగా వ్యవసాయానికి విద్యుత్‌ను సరఫరా చేసే విద్యుత్ లైన్ స్తంభం కూడా శిధిలావ్యవస్థకు సిద్దంగా ఉందని వార్త దినపత్రికలో వార్త కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు తెల్సిందే. వార్త కథనానికి స్పందించిన విద్యుత్ అధికారులు కూలడానికి సిద్దమైన విద్యుత్ పోల్స్ స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, ఇటు గృహ అవసరాలను, అటు వ్యవసాయ రంగానికి ఆటంకం లేకుండా విద్యుత్ స్తంభాలను పునర్ నిర్మించారు. విద్యుత్ అధికారుల స్పందనపై గ్రామ పంచాయతీ ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు, రైతులకు ఉపయోగపడే విద్యుత్ సేవలపై విద్యుత్ అధికారులు తక్షణం స్పందించాలని కోరుతున్నారు.

# చెరువుల్లో మట్టి తొలగింపుతో భయాందోళనకు గురౌతున్న రైతులు

శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 26 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు చెరువుల్లోంచి మట్టితొలగింపు రైతులను భయాందోళనకు గురౌతున్నారు. నాయుడుపేట రేణిగుంట ఆరులేన్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించి పనులు సుమారు ఏడాదిన్నరగా సాగుతున్నాయి. దాంతో ఆ రోడ్డు నిర్మాణ సంస్థ స్థానిక నాయకులు సహకారంతో ఛాటా నాయకులకు మట్టితరలింపు కాంట్రాక్టు అప్పగించారు. ఇది ఓ ఉపాధిగా మారింది. ఈ నేపథ్యంలో ఎక్కడ చెరువు ఖాళీ ఉంటే అక్కడ మట్టి సేకరణకు పూనుకుంటున్నారు. దాంతో చెరువుల్లో మట్టి తొలగింపుతో గుంతలు ఏర్పడతాయని వర్షానికి నీరు చెరువులోకి వస్తే పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుందని చెబుతున్నారు. నీళ్ళు తాగటానికి వెళ్ళిన పశువులు గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోతాయని వివరిస్తున్నారు. అలాగే మట్టి తొలగింపుతో మనుషులు కూడా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

**ఓటు చెరువుకు ఎసరు:**

శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామానికి చెందిన ఓటు చెరువుపై మట్టి కాసురుల కన్ను పడింది. ఇక ఆలస్యం ఎందుకు? వెంటనే జెసిబిలు ఏర్పాటు చేసి మట్టి తరలింపుకు పూనుకున్నారు. ఓటు చెరువులో మట్టి గ్రావెల్‌తో కూడుకొని ఉంది. దాంతో మట్టి తరలింపుకు పూనుకుంటున్న అధికార పార్టీ కి చెందిన నాయకులు కొందరు ఓటు గుంట చెరువును తవ్వటం ప్రారంభించారు. అయితే చుట్టుపక్కల గ్రామాల్లో రైతులు ఆందోళన చెందుతున్నా ఎవర్ని ప్రశ్నిస్తే ఏమౌతుందో అని ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ కేసులు పెడతారో అని భయభ్రాంతులౌతున్నారు. అయితే కనీసం పంచాయతీకి నిధులు అయినా వస్తాయా?; అనుకుంటే అదీలేదు. రోడ్డు కాంట్రాక్టర్ ఏమో కోట్లకు కోట్లు సంపాదించుకుంటున్నారు. కానీ ప్రజల మాత్రం ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని వాపోతున్నారు

## రె.వె స్వరూపరాజన్‌కు అభినందనల వెల్లువ



కోట, అక్టోబర్ 26 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని హోలీప్రేయర్ చర్చిలో రె.వె స్వరూప రాజన్ గురుపట్టాభిషేకం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ బిషప్‌లు మైఖేక్ బెన్హర్, చంద్రశేఖర్, డాక్టర్ రె.వె ప్రదీప్ కుమార్, దయాసాగర్‌లు విచ్చేశారు. గతంలో అభిలాష్ పోషించిన కీలకపాత్రను ప్రస్తుతం అభిలాష్ సోదరుడు స్వరూపరాజన్‌కు అప్పగిస్తూ గురు పట్టాభిషేకం చేశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల పాస్టర్లు, సంఘ సభ్యులు కరతాళ ధ్వనులతో అభినం దనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన స్వరూపరాజన్ మాట్లాడుతూ తన సోదరుడు అభిలాష్‌ను స్ఫూర్తిగా తీసుకొని సమాజసేవలో భాగస్వామినవుతానని చెప్పారు. తనకు ఉన్నంతగా ప్రజలకు సేవ చేయడమే తనతండ్రి ప్రదీప్‌కుమార్ నేర్పిన విద్య అని చెప్పుకొచ్చారు. అనంతరం స్వరూపరాజన్‌కు దయాసాగర్ చక్కని సందేశం అందించారు. ఈ కార్యక్రమం అంతా రె.వె ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ మేరీ సుజాత, కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల పాస్టర్లు, ప్రతినిధులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో రాష్ట్ర మాజీ మంత్రి కొడాలి నాని



కాణిపాకం, అక్టోబర్ 26 ప్రభాతవార్త: రాష్ట్ర మాజీ మంత్రి, గుడివాడ శాసనసభ్యులు కొడాలి వెంకటేశ్వరరావు (కొడాలి నాని) కుటుంబసమేతంగా గురువారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారి వెంట ఆలయ ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, చిత్తూరు రూరల్ సీఐ రవిశంకర్‌రెడ్డి, స్థానిక ఎస్సై శ్రీనివాస్, స్థానిక వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ సిబ్బందికి బ్రహ్మోత్సవ బహుమతి పంపిణీ



కాణిపాకం, అక్టోబర్ 26 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానం సిబ్బందికి గురువారం బ్రహ్మోత్సవ బహుమానంను అందజేశారు. ప్రతి ఏటా ఆలయంలో 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతుంటాయి. ఈమేరకు దేవస్థానంలో సెప్టెంబర్ 18 నుండి అక్టోబర్ 8 వరకు స్వామివారి బ్రహ్మోత్స వాలను జరిగాయి. ఈబ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన ఆలయ అధికారులు, సిబ్బందికి బ్రహ్మోత్సవాల అనంతరం ప్రతి ఏటా దేవస్థానం తరపున బ్రహ్మోత్సవ కానుకను అందజేయడం ఆనవాయితీ. ఈమేరకు దేవస్థానంలో పనిచేసే అధికారులు, సిబ్బందికి ప్రతి ఒక్కరికి గురువారం స్థానిక ఛైర్మన్ అతిథి గృహంలో బ్రహ్మోత్సవ కానుకగా బియ్యం బస్తాను స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 రోజుల పాటు జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆలయ అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో విజయవంతం అయ్యాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, స్థానిక ఎంపీటీసీ సుధీర్, వైకాపా నాయకులు చిగరపల్లె గణేష్ ప్రసాద్‌రెడ్డి, చిన్నారెడ్డి, రవిచంద్రారెడ్డి, గోపీనాథన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్‌గా డా॥ వేణుగోపాల్‌రెడ్డి



కుప్పం, అక్టోబర్ 26 ప్రభాతవార్త : ద్రవిడ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా డా॥ ఎకె వేణుగోపాల్‌రెడ్డిని కొనసాగిస్తూ వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామ కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య వేణుగోపాల్‌రెడ్డి గురువారం పదవీ విరమణ చేయాల్సి ఉంది. తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా రిజిస్ట్రార్‌గా డా॥వేణుగోపాల్‌రెడ్డినే కొనసాగుతారని వైస్‌చాన్సలర్ పేర్కొన్నారు.

## పుష్ప పల్లకిపై శ్రీ ఉగ్రప్రత్యంగిరాదేవత'

**అంగరంగ వైభవంగా గ్రామోత్సవం**



చంద్రగిరి, అక్టోబర్ 26 ప్రభాతవార్త: శ్రీ ఉగ్రప్రత్యంగిరాదేవత పుష్ప పల్లకిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ గ్రామ పంచాయతీ పరిధిలో వెలసియున్న శ్రీ ఉగ్రప్రత్యంగిరా దేవతా పీఠంలో దేవీ నవరాత్రి మహోత్సవాలను అంరంగ వైభవంగా నిర్వహిచారు. గురువారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఇందులో భాగంగా పీఠాధిపతి సూరి స్వామి ఉదయం 6 గంటల నుండి 7.30 గంటల వరకు అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ గావించారు. 9 గంటల నుండి 12 గంటల వరకు అన్నమయ్య సంకీర్తనలు వినిపించారు. రాత్రి అమ్మవారి పుష్ప పల్లకి వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

## శివయ్య సేవలో హైకోర్టు జడ్జి



తొట్టంబేడు, అక్టోబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శేషసాయి కుటుంబ సభ్యులతో పూజలు జరిపించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి.సాగర్ బాబు వేదపండితులతో ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్‌మేరకు స్వాగతం చెప్పారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ను ఇఓ ఏర్పాటు చేసారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో 12అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాసులునాయక్, సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్ టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం, పిఆర్ఓ కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశం కోసమే ఈ దేహం...ప్రజల కోసమే మా ప్రాణం

**-అమరులైన పోలీసులకు పాఠశాల విద్యార్థులు అంజలి**





తిరుపతి, అక్టోబర్ 26ప్రభాతవార్త: సమాజం కోసం వారి రక్షనకోరి విధి నిర్వహణలో ఎందరో పోలీసులు అహర్నిశలు శ్రమించి మృతి చెందారని, వారు చేసిన త్యాగం ఎన్నటికీ మనమందరం గుర్తుంచుకోవాలని తిరుపతి జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి కోరారు. పోలీసులు ఉపయోగించే పరికరాలను ఆయుధాలుగా చూడకూడదని, ఆత్మరక్షణకోసం వాడేవిగా మాత్రమే భావించాలన్నారు. సహజంగానే పోలీసులు అతిక్లిష్టమైన పరిస్థితుల్లో తప్ప ఈఆయుధాలను వాడరన్నారు. ఆయుధాలు ఎలా పనిచేస్తాయో, వాటి ఉపయోగాలు తెలియజేస్తూ విద్యార్థులకు సవివరంగా ఎస్‌పి తెలిపారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని తిరుపతి జిల్లాలో పలు పాఠశాల విద్యార్థులకు గురువారం ఉదయం ఓపన్‌హౌస్ కార్యక్రమాన్ని ఎస్‌పి ప్రారంభించారు. విద్యార్థులతో తండ్రిలాగా మెలగి వారితో కలివిడిగా పలకరించారు. ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల ఆయుధాలు, పోలీసు పరికరాలు, వాటి పనితీరు గురించి వివరించి అవగాహన కల్పించారు. లైంగిక వేధింపుల నుండి మహిళలు, పిల్లల రక్షణ,సామాజిక పాత్ర అంశంపై వ్యాసరచన పోటీలు, చర్చలు పోటీలు నిర్వహించారు. సోషల్‌మీడియా వేధింపులు, సైబర్ నేరాలను అరికట్టడంలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు, బృంద చర్చలను నిర్వహించారు. ప్రతిభ చూపిన మొదటి ముగ్గురికి ప్రోత్సాహక భహుమతిగా 5వేలురూపాయలు, 3వేలు, 2వేల రూపాయలను వారోత్సవాల ఆఖరురోజు ప్రదానం చేస్తామని ఎస్‌పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఓపన్‌హౌస్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు పోలీసులు సమాజ శ్రేయస్సుకోసం చేస్తున్న త్యాగాలను తెలుసుకుని పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు వెంకటరావు (పరిపాలన), కులశేఖర్ (శాంతిభద్రతలు), లక్ష్మీనారాయణ రెడ్డి (ఏఆర్), డిఎస్‌పిలు గిరిధర్(ఎస్‌బి), సురేంద్రరెడ్డి (తిరుపతి), కాటమరాజు(దిశ), రవీంద్రారెడ్డి(ఏఆర్), చంద్రశేఖర్, చిరంజీవులు(హోంగార్డు), సిఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో నియంత పాలన... చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ అండ

**నిజం గెలవాలిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్**



తిరుపతి టౌన్, అక్టోబర్ 26 ప్రభాతవార్త : రాష్ట్రంలో నియంత పాలన నడుస్తోందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ గురువారం తిరుపతిలో జరిగిన నారా భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎప్పుడూ రాజకీయాల్లో కనిపించని భువనేశ్వరి జనం మధ్యకు రావాల్సి వచ్చిందన్నారు. నిజం గెలవడం కోసం పోరాటం చేయాల్సి వస్తోందన్నారు. చంద్రబాబును అరెస్టు చేస్తూనే నేనున్నానంటూ పవన్ కళ్యాణ్ మద్దతు ఇచ్చారాన్నరు. చంద్రబాబు, లోకేష్‌ను వైకాపా అడ్డుకుంటోందన్నారు. ఈ ప్రభుత్వం వెయ్యి మందిపై అక్రమ కేసులు పెట్టిందన్నారు. అభివృద్ధి ప్రధాతయిన చంద్రబాబు ఒక వైపు ఆశయంతో ఉన్న పవన్ కళ్యాణ్ మరో వైపు జనం కోసం పని చేస్తున్నారన్నారు. శ్రీ వెంకటేశ్వరస్వామి అండతో నిజం గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు.

## నామట్టి నాదేశం కలశాల గ్రామోత్సవం



తొట్టంబేడు, అక్టోబర్ 26 ప్రభాతవార్త : బిజెపి ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు నెల రోజుల పాటు రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ సారథ్యంలో వివిధ మండలాల నుంచి సేకరించిన మట్టి కలశాలను గురువారం శ్రీకాళహస్తిలో భారీ ఎత్తున ర్యాలి నిర్వహించి గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ దేశ ప్రజల ఐక్యత సమగ్రతలను బలోపేతం చేయటటానికే ప్రధాని నరేంద్రమోదీ నా భూమి నా దేశం కార్యక్రమాలను రూపొందించారని వివరించారు. ఈ కార్యక్రమాలను బిజెపి కుటుంబసభ్యులు జవాబుదారి తనంతో పూర్తి చేసారన్నారు. పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధిలో కలశాలను ప్రదర్శన నిర్వహించారు. ఈ మట్టితో అమృతవనం సృష్టించబడుతుందని వివరించారు. అమృత కలశ యాత్రలో మనం అందరం పాల్గొందామని పిలుపు నిచ్చారు. శ్రీకాళహస్తి నుంచి బిజెపి నేతలు పల్లం చెంగల్రాయులు, ఇమ్మిడి శెట్టి మోహన్‌రావు, కోట వెంకటేష్, కేతినేని బాలాజి, తిరువీధుల రాజానరసింహులు, టి.గోపిలు వెళ్ళటానికి అవకాశం కల్పించినట్లు కోలా ఆనంద్ ప్రకటించారు. ఈకార్యక్రమాల్లో అసెంబ్లీ కన్వీనర్ కోలా ఆనంద్‌కుమార్, జిల్లా పార్టీ కార్యదర్శి, కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డిజిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి గోపాల్, రూరల్ మండల అధ్యక్షుడు వేదాం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాత్రివేళల్లో పిహెచ్‌సిల్లో విధులు నిర్వహించలేం

**-ఆశావర్కర్ల ఆవేదన**
**-పరిష్కరించిన డిడిఓ**



తొట్టంబేడు, అక్టోబర్ 26 ప్రభాతవార్త : రాత్రివేళల్లో తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించలేమని తొట్టంబేడు డిడిఓ, జెఎఎస్ నోడల్ అధికారిణి డాక్టర్ తేజేశ్వరికి ఆశావర్కర్లు తేల్చిచెప్పారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన రాత్రివేళల్లో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉంది. అయితే తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉన్నారు. విధులు మాత్రం ఎవరికి కేటాయిస్తే వారు చేయడం జరుగుతోంది. అయితే రాత్రివేళల్లో ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద లైట్లులేకపోవడం మరోవైపు పాములు బెడద ఎక్కువవడంతో బిక్కుబిక్కుమంటూ స్టాఫ్‌నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. రాత్రివేళల్లో కేవలం ఒక్క స్టాఫ్ నర్సు మాత్రమే ఉంటుంది. వీరికి సహాయం గా ఎవరైనా ఆశావర్కర్ ఉంటే బాగుంటుందని తెలపగా రాత్రివేళల్లో స్టాఫ్‌నర్సుతో పాటు వారు విధులు నిర్వహిస్తుంటారు. అంతేకాకుండా ఇటీవల ఆశాడే సందర్భంగా వైద్యాధికారిని డాక్టర్ లహరిణి ఆశావర్కర్లకు అందరు సహజరు కాలేదని గైర్హాజరు వేయడంతో వివాదం చినికి చినికిగాలివానలా మారింది. అంతేకాకుండా కొంతమంది ఆశావర్కర్లకు వేతనాలు నిలిపివేయడంతో వారు యూనియన్ నాయకులకు తెలిపారు. దీంతో యూనియన్ నాయకులు గురవయ్య, వెంకట య్య, కుమార్‌లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని విష యాన్ని సంబందిత డిడిఓ డాక్టర్ తేజేశ్వరికి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సమస్య తమకు ఏన్నడూ కూడా ఆశావర్కర్లు తెలియజేయలేదని ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి వస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఇటీవల రాత్రివేళల్లో విధుల్లో ఉన్న ఓ స్టాఫ్‌నర్సు టైఫాయిడ్ జ్వరంతో విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉండగా పాముగావడంతో గమనించిన మరో స్టాఫ్ నర్సు గుర్తించి ఇతరుల సాయంతో పామును చంపివేసింది. ఆశావర్కర్లకు వేతనాలు ఆపడంపై పిహెచ్ఎన్ సంపూర్ణమ్మను విచారించగా వైద్యాధికారిణి లహరిణి ఆదేశాల మేరకే తాము నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. ఇకపై ఆశావర్కర్లకు రాత్రివేళల్లో విధులు ఉండవని అయితే ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వాచ్‌మెన్‌ను ఇస్తే ఎవ్వరికి ఇబ్బందులు ఉండవన్నారు. దీనిపై డిఎంహెచ్ఓ శ్రీహరి స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాచ్‌మెన్‌ను నియమించడంతో పాటు మెయిన్‌రోడ్డు నుంచి ఆరోగ్య కేంద్రం వరకు వీధిలైట్లు వేయాలని ఆస్పత్రి సిబ్బంది కోరుతున్నారు.